# బోడికొండ గ్రానైట్ త్రవ్వకాల అనుమతులు రద్దుచేయాలని ఐటిడిఏ వద్ద ధర్నా




**రైతుకూలీ, గిరిజననేతల ఆధ్వర్యంలో పార్వతీపురంలో ధర్నా**

**పార్వతీపురం, 20-6-16 :**

పార్వతీపురం మండలం బుదురువాడ పంచాయితీలో గల బోడకొండ కలర్ గ్రానైట్ త్రవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దుచేయాలని కోరుతూ 20-6-16 తేదీన పార్వతీపురం ఐటిడిఏ ఆఫీసు వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. బోడికొండపై కలర్ గ్రానైట్ త్రవ్వకాలకు అనుమతులు వచ్చాయని చెబుతున్న పోకర్నో కంపెనీ గ్రానైట్ త్రవ్వకాల కొరకు యంత్రాలను సమాయత్తం చేస్తున్నది. ఈ కొండ సర్వే నెం. 121లో సుమారు 1200 ఎకరాలు. ఈ కొండపై 20 గ్రామాలు (గిరిజన) ఆధారపడుతున్నాయి. ఈ కొండచుట్టూ వున్న వందలాది ఎకరాలలో జీడితోటలు, వెదురు, జామాయిలు తోటలు, వరి పండే పొలాలు, ఇతర సాంప్రదాయ వ్యవసాయ పంటలు రాగులు, జొన్నలు, కందులు, కొర్రలు తదితర పంటలు పండించుకొని గిరిజనులు, గిరిజనేతర కుటుంబాలు జీవిస్తున్నాయి. వెదురు ఇతర ముఖ్యమైన కలపను ఆధారం చేసుకొని ప్రజలు జీవిస్తున్నారు. ఈ కొండపై గ్రానైట్ త్రవ్వకాలకు అనుమతి ఇస్తే ప్రజల జీవితాలు ఛిద్రం అవుతాయి. పంట పొలాలు నాశనం అవుతాయి. పచ్చని అడవులు కనిపించకుండాపోతాయి. ప్రజలు నిరాశ్రయులు అవుతారు. పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది.

అందువలనే గత సం॥రం జులై 29, 30 తేదీలలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. అప్పుడు ప్రజాభిప్రాయం క్వారీల త్రవ్వకాలకు వ్యతిరేకత వ్యక్తం చేస్తే, నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. తర్వాత ప్రజాసంఘాల నాయకత్వంలో గిరిజనులు పెద్దఎత్తున ఐటిడిఏ వద్ద, జన్మభూమి సందర్భంగా ఆందోళనలు చేపట్టారు. అప్పుడు ఎంఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, అధికారులు బోడికొండపై అనుమతులు మంజూరు చేయకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కాని ఇప్పుడు పోకర్నో కంపెనీ మాకు అనుమతు లున్నాయని త్రవ్వకాలకు సమాయత్తం అవుతున్నది. అందువలన 20 గ్రామాల ప్రజల జీవనోపాధిని దెబ్బతీసే పోకర్నో కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఐటిడిఏ ఆఫీసు వద్ద ధర్నా చేశారు.

ఈ ధర్నాలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) విజయనగరం జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు, సహాయ కార్యదర్శి కా॥ పి. శ్రీనునాయుడు, వ్యవసాయ కార్మికసంఘ జిల్లా కార్యదర్శి కా॥ రెడ్డి శ్రీరామ్మూర్తి, గిరిజన సంక్షేమసంఘం నాయకుడు సాయిబాబా, అఖిల భారత రైతుకూలీసంఘం జిల్లా అధ్యక్షుడు కా॥ వెంగడ కృష్ణ, రమణిలు పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ఐటిడిఏ వరకు ఊరేగింపు జరిగింది.

oooooo